సాక్షి ప్రకాశం

బుధవారం ׀ 19 ׀ ఫిబ్రవరి ׀ 2025



కాళ్ల పారాణి ఆరకముందే..

పెళ్లయిన మరునటి రోజే నవ వధువు పుట్టింటి లోనే ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన చిన్నకంభం పంచాయతీ దేవనగరంలో జరిగింది.

- 8లో..

మిస్టరీగా మృతదేహాలు



ఒంగోలు నగర పరిధిలో ఒకే రోజు ఇద్దరు యువకులు ఒకే తరహాలో అర్ధరాత్రి రోడ్డు పక్కన మృతిచెంది ఉండటం అనుమానాలకు తావిస్తోంది.

- 8లో..

గరిష్ఠం/కనిష్ఠం 32/22

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. పొగమంచు కురుస్తుంది. చలిగాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

వైఎస్ జగన్‌ను కలిసిన బూచేపల్లి



వైఎస్ జగన్ మోహనరెడ్డికి పుష్పగుచ్ఛం అందిస్తున్న బూచేపల్లి వెంకాయమ్మ, శివప్రసాదరెడ్డి

దర్శి(కురిచేడు): వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహనరెడ్డిని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, పార్టీ జిల్లా అధ్యక్షుడు, దర్శి ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి శివప్రసాదరెడ్డి మంగళవారం మర్యాద పూర్వకంగా కలిశారు. తాడేపల్లిలోని ఆయన నివాసంలో కలిసి జిల్లా పరిస్థితులపై చర్చించారు. పార్టీ పటిష్టానికి తీసుకుంటున్న చర్యలను వివరించారు.

19న రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ సభ్యురాలి రాక

ఒంగోలు సిటీ: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యురాలు బత్తుల పద్మావతి ఈ నెల 19, 20 తేదీల్లో ఒంగోలుకు వస్తున్నట్లు జిల్లా సమగ్ర బాలల పరిరక్షణ అధికారి దినేష్‌కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. గుంటూరులోని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ ప్రధాన కార్యదర్శి పద్మజ సంబంధిత పర్యటన ఉత్తర్వులను వెల్లడించినట్లు తెలిపారు. బుధవారం ఉదయం 10 గంటలకు కలెక్టరేట్ లోని గ్రీవెన్స్ హాలులో జిల్లా అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహిస్తారన్నారు. 20వ తేదీ ప్రభుత్వ, ప్రైవేటు, కార్పొరేట్ స్కూల్స్, కళాశాల అధికారులతో సమీక్షలు నిర్వహించనున్నట్లు చెప్పారు.

పొగాకు రైతుకు రానున్నవి అన్నీ మంచి రోజులే. నాలుగేళ్లుగా పొగాకు రైతు పంట పండింది. చరిత్రలో ఎన్నడూ లేని విధంగా లాభాలు రావడంతో సాగు విస్తీర్ణం కూడా పెరుగుతూ వస్తోంది. ఈ ఏడు కూడా కర్నాటకలో పొగాకు కొనుగోళ్లలో మంచి ధరలు వస్తుండడంతో జిల్లాలోని పొగాకు రైతుల్లో ఆశలు చిగురిస్తున్నాయి. కర్నాటకలో కేజీ పొగాకు ధర గరిష్టంగా రూ.331 పలుకుతోంది. సరాసరి ధర రూ.268, లోగ్రేడ్ కూడా రూ.220 పలుకుతుండడంతో ఇదే ధరలు ఇక్కడ కూడా వస్తాయన్న ఆశాభావాన్ని వ్యక్తం చేస్తున్నారు. గత ఏడాది జిల్లాలో పొగాకు కేజీ గరిష్ఠ ధర రూ.320 పైనే పలికింది. ఈ నెల 25వ తేదీ బోర్డు ఉన్నతాధికారులు జిల్లా అధికారులతో సమావేశం నిర్వహించనున్నారు. ఆ తర్వాతే జిల్లాలో కొనుగోళ్ల ప్రారంభ తేదీ ఖరారవుతుంది.

ఆశలు పండగా.. ధర దండిగా



- కర్నాటక రేట్లతో పొగాకు రైతుల్లో ఆశలు
- అక్కడ కేజీ పొగాకు గరిష్ఠ ధర రూ.331
- గత ఏడాది మన జిల్లాలో గరిష్ఠ ధర రూ.320
- ఇప్పటికే లక్ష్యానికి మించి పొగాకు సాగు
- 68,500 హెక్టార్లకు అనుమతి ఇవ్వగా 88 వేల హెక్టార్లలో సాగు
- 103 మిలియన్ కేజీలు కొనుగోలుకు అనుమతి
- కొనుగోలు తేదీపై స్పష్టత ఈనెల 25 తేదీన

చీమకుర్తి: ఉమ్మడి ప్రకాశం జిల్లాలో కలిపి మొత్తం 11 వేలం కొనుగోలు కేంద్రాలు ఉన్నాయి. అందులో ఒంగోలు–1, ఒంగోలు–2, వెల్లంపల్లి, టంగుటూరు, కొండపి, పొదిలి, కనిగిరి, కందుకూరు–1, కందుకూరు–2, కలిగిరి, డీసీపల్లి కేంద్రాలు జిల్లా పరిధిలో ఉన్నాయి. ఈ వేలం కేంద్రాల్లో గత ఏడాది 88 మిలియన్ కేజీల పొగాకు కొనుగోలుకు బోర్డు అనుమతినివ్వగా రైతులు అనుమతికి మించి సాగు చేశారు. రైతుల విజ్ఞప్తి మేరకు 153 మిలియన్ కేజీల పొగాకును బోర్డు కొనుగోలు చేసింది. దానిని దృష్టిలో ఉంచుకొని ఈ సంవత్సరం పొగాకు సాగు విస్తీర్ణం కూడా పెరగటంతో అధికారకంగా బోర్డు 103 మిలియన్ కేజీలు కొనుగోలు చేసేందుకు అనుమతినిచ్చింది. రైతులు సాగు చేసిన విస్తీర్ణం ఎక్కువగా ఉండటంతో ఈ సారి కూడా బోర్డు నిర్ణయించిన దానికంటే గత ఏడాది కొనుగోలు చేసిన 153 మిలియన్ కేజీలను మించి పోతుందేమోనని బోర్డు అధికారులు అంచనాలు లెక్కగడుతున్నారు.



చీమకుర్తిలో సాగవుతున్న పొగాకు

పెరుగుతూ వస్తున్న సాగు విస్తీర్ణం...

నాలుగేళ్లుగా వస్తున్న లాభాలతో పొగాకు సాగు చేసే రైతుల సంఖ్య, విస్తీర్ణం ఏటికేడు పెరుగుతూ వచ్చింది. ఈ సంవత్సరం 68,500 హెక్టార్లకు మించి పొగాకు సాగుచేయొద్దని బోర్డు అధికారులు రైతుల చెవిలో గూడుకట్టుకొని ప్రచారం చేసినా లాభాల ఊహల్లో తేలుతున్న రైతులు వారి సూచనలను పెడచెవిన పెట్టారు. ఏకంగా 88 వేల హెక్టార్లలో సాగు చేశారు. అంటే బోర్డు అధికారులు చెప్పిన విస్తీర్ణం కంటే 28 శాతం ఎక్కువ సాగు చేశారు. జిల్లాలోని 11 వేల కేంద్రాల పరిధిలో మొత్తం 24 వేల బ్యారన్‌ల ద్వారా 30 వేల మంది రైతులు పొగాకు సాగు చేస్తున్నారు. గతంలో కాడి కింద పడేసిన రైతులు సైతం తమకున్న పొలంతో పాటు ఇతరుల పొలాన్ని కూడా కౌలుకు తీసుకొని సాగు చేస్తున్నారు. బ్యారన్‌లను అద్దెలకు తీసుకొని మరీ సాగు చేయటానికి రైతులు ఉత్సాహం చూపుతున్నారు. ఎకరం పొలం కౌలు గతంలో రూ.10 వేలు ఉండేది. ఇప్పుడు రూ.20 వేలకు పెరిగింది. గతంలో బ్యారన్ కౌలు రూ.50 వేల నుంచి 60 వేల మధ్య ఉండేది, అది కాస్త ఇప్పుడు రూ.1.50 లక్షల నుంచి 1.80 లక్షలకు పెరిగింది.

> **కర్నాటకలో మంచి ధరలు వస్తున్నాయి**
>
> కర్నాటకలో పొగాకుకు మంచి ధరలు వస్తున్నాయి. కేజీ పొగాకు గరిష్టంగా రూ.331, సరాసరిన రూ.268 పలికింది. లోగ్రేడు కూడా రూ.220కు పైగా ధర పలుకుతోంది. దానిని బట్టి మన జిల్లాలోని పొగాకుకు మంచి ధరలు రావచ్చని అంచనా ఉంది. కానీ రైతులకు 68,500 హెక్టార్లలో పొగాకు సాగు చేయాలని అనుమతినిస్తే వారు మాత్రం ఏకంగా 88 వేల హెక్టార్లలో సాగు చేశారు. దాని ప్రభావం ఎలా ఉంటుందో వేలం మొదలైతే గానీ చెప్పలేం.
>
> – ఆర్.లక్ష్మణ్‌రావు, ఆర్.ఎం, ఒంగోలు పొగాకు బోర్డు

ఈ నెల 25 అధికారుతో సమావేశం:

రాష్ట్ర పొగాకు బోర్డు ఉన్నతాధికారులతో జిల్లాలోని 11 వేల కేంద్రాలకు సంబంధించిన అధికారులతో ఈ నెల 25న సమావేశం జరగనుందని బోర్డు అధికారులు సూచనప్రాయంగా తెలిపారు. ఆ సమావేశంలో జిల్లాలోని వేలం కేంద్రాల్లో పొగాకు కొనుగోళ్లు ఎప్పుడు ప్రారంభం కావాలో అనే అంశంపై కూడా స్పష్టత వచ్చే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు.

రైతులను వేధిస్తున్న మల్లె..

పొగాకు సాగులో వేళ్ల మీద పెరిగే మల్లె రైతులను వేధిస్తోంది. ఇది మొక్కలు ఏపుగా పెరగటంలో ఆటంకం కలిస్తుందని రైతులు, బోర్డు అధికారులు చెబుతున్నారు. దాంతోపాటు ఇటీవల కురిసిన ముసురు వర్షాలు, దాని వలన ఏర్పడిన తెగుళ్ల వలన కూడా పంట దిగుబడి తగ్గే అవకాశం ఉంది. ఇప్పటికే రైతులు పొగాకు సాగులో రూ.లక్షలు ఖర్చుపెట్టారు. తెగుళ్ల వలన దెబ్బతిని పోయిన పంట పోయినా ఉన్న పొగాకుకు మంచి నాణ్యమైన రంగు వస్తే మంచి ధర పలుకుతుందనే ధీమాలో రైతులు ఆశలు పెంచుకున్నారు. కర్నాటకలోని ధరలు రైతుల్లో ఇంకాస్త ఊపిరిపోశాయి.

వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శిగా రమణారెడ్డి



ఒంగోలు సిటీ: మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శిగా మార్కాపురం నియోజకవర్గానికి చెందిన కేవీ రమణారెడ్డిని నియమించారు. ఆ మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొంది.

గిద్దలూరు నగర పంచాయతీ కమిషనర్ బదిలీ

గిద్దలూరు(బేస్తవారిపేట): గిద్దలూరు నగర పంచాయతీ కమిషనర్ డి.వెంకటదాసు నంద్యాల మున్సిపాలిటీ అసిస్టెంట్ కమిషనర్‌గా బదిలీ అయ్యారు. ఈ మేరకు మంగళవారం రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. గిద్దలూరు నగర పంచాయతీ నూతన కమిషనర్‌గా ఐ.శ్రీనివాసులు నియమించారు. గుడివాడ మున్సిపాలిటీ మేనేజర్‌గా పనిచేస్తున్న ఈయన పదోన్నతిపై గిద్దలూరులో నియమితులయ్యారు.

క్యాథ్‌ల్యాబ్‌ను త్వరగా ప్రారంభించాలి

ఒంగోలు టౌన్: జిల్లాలో రోజురోజుకూ గుండె జబ్బులు పెరిగిపోతున్న నేపథ్యంలో ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో గత ప్రభుత్వం క్యాథ్ ల్యాబ్ మంజూరు చేసిందని, ప్రస్తుతం ల్యాబ్ ఏర్పాటు పూర్తయిన దృష్ట్యా సాధ్యమైనంత త్వరగా ప్రారంభించాలని మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు బిల్లా చెన్నయ్య కోరారు. ఈమేరకు స్పెషల్ చీఫ్ సెక్రటరీ టి.కృష్ణబాబును కలిసి వినతి పత్రం అందజేసినట్లు తెలిపారు. ఇటీవల నిరుపేద ప్రజలు ఎక్కువగా గుండెజబ్బుల బారిన పడుతున్నారని, చికిత్స కోసం కార్పొరేట్ ఆస్పత్రులకు వెళ్లలేక ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

అధికారుల నిర్లక్ష్యం ఖరీదు రూ.10 కోట్లు

- మూలగుంటపాడులో ప్రభుత్వ జూనియర్ కాలేజీ ఉందని నిషేధిత జాబితాలో 860 ఎల్‌పీఎం నంబర్
- రీసర్వేలో అధికారుల నిర్వాకం
- ఆ ఎల్‌పీఎం కింద 51 సర్వే నంబర్లలో 281 ఎకరాలు
- నాలుగు నెలలుగా ఆగిన భూముల రిజిస్ట్రేషన్
- పడిపోయిన భూముల ధరలు
- రిజిస్ట్రేషన్ల ద్వారా ప్రభుత్వ ఆదాయానికి భారీ గండి

సింగరాయకొండ: భూముల రీసర్వేలో మండల రెవెన్యూ అధికారుల నిర్లక్ష్యం ఫలితంగా ప్రభుత్వానికి సుమారు రూ.10 కోట్లు నష్టం వాటిల్లగా, వందల ఎకరాల్లో భూ యజమానులు లబోదిబోమంటున్నారు. వివరాల్లోకి వెళ్తే..మండలంలోని మూలగుంటపాడు పంచాయతీ పరిధిలోని సర్వే నంబరు 108 కు రీ సర్వే లో భాగంగా 860 ఎల్‌పీఎం నంబరు కేటాయించారు. ఈ ఎల్‌పీఎం కింద సుమారు 51 సర్వే నంబర్లు ఉండగా 281 ఎకరాల విస్తీర్ణం ఉంది. అయితే ఈ ఎల్‌పీఎం నంబరు పరిధిలో ప్రభుత్వ జూనియర్ కాలేజి కూడా ఉండటంతో ఆ నంబరును నిషేధిత జాబితాలో చేర్చారు. రెవెన్యూ అధికారులు చేసిన పొరబాటుకు నాలుగు నెలలుగా 108 సర్వే నంబరులో భూముల రిజిస్ట్రేషన్ ఆగిపోయింది. ఫలితంగా రిజిస్ట్రేషన్‌ల ద్వారా ప్రభుత్వానికి రావాల్సిన ఆదాయం రోజుకు సుమారు రూ.8 లక్షల నష్టం వాటిల్లుతోంది. అంటే ఈ నాలుగు నెలల్లో సుమారు రూ.10 కోట్ల మేర ప్రభుత్వ ఆదాయానికి గండిపడింది. అంతేకాక భూముల ధరలు కూడా అమాంతం పడిపోయాయి. దీంతో భూముల కొనుగోలుదారులు, అమ్మకందారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఇప్పటికే సింగరాయకొండ, సోమరాజుపల్లి, పాతసింగరాయకొండ, కనుమళ్ల, శానంపూడి గ్రామ పంచాయతీలోని సుమారు 1,500 ఎకరాల భూములు దేవదాయ శాఖ పరిధిలోకి రావటంతో ఆ సర్వే నంబర్లను నిషేధిత జాబితాలో ఉంచటంతో 11 సంవత్సరాలుగా భూముల రిజిస్ట్రేషన్లు ఆగిపోయి ప్రభుత్వానికి కోట్లాది రూపాయలు రిజిస్ట్రేషన్ చార్జీల రూపంలో నష్టం వాటిల్లింది. భూముల ధరలు పడిపోయి ప్రజలు అమ్ముకోలేక, బ్యాంకుల్లో రుణాల కోసం తనఖా పెట్టుకునే అవకాశం లేక ఆర్థికంగా నష్టపోయారు. కానీ ఇప్పుడు కేవలం అధికారులు నిర్లక్ష్యం కారణంగా 281 ఎకరాల్లో రిజిస్ట్రేషన్లు ఆగిపోవటంతో మళ్లీ ఎప్పుడు సమస్య పరిష్కారమై రిజిస్ట్రేషన్లు ప్రారంభిస్తారో అర్థం కావటం లేదని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



నిషేధిత జాబితాకు కారణమైన ప్రభుత్వ జూనియర్ కాలేజి

> **నివేదిక వస్తే చర్యలు తీసుకుంటాం**
>
> 108 సర్వే నంబరుకు సంబంధించి విచారణకు స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌ను నియమించాం. ఆయన ఇచ్చే నివేదిక ప్రకారం నా లాగిన్ ద్వారా ఆ సర్వే నంబరును నిషేధిత భూముల జాబితా నుంచి తొలగించి మళ్లీ రిజిస్ట్రేషన్ ప్రక్రియ ప్రారంభించేలా చర్యలు తీసుకుంటాను.
>
> – గోపాలకృష్ణ, జాయింట్ కలెక్టర్

> **ప్రభుత్వానికి రోజుకు రూ.8 లక్షల నష్టం**
>
> సుమారు నాలుగు నెలలుగా 108 సర్వే నంబరులో రిజిస్ట్రేషన్ల ప్రకియ ఆగిపోవడంతో ప్రభుత్వానికి రోజుకు సుమారు రూ.8 లక్షల మేర నష్టం వస్తోంది. ఈ మండలానికి ప్రభుత్వం రూ.30 కోట్ల టార్గెట్ ఇస్తే ఇప్పటికి రూ.15 కోట్లు మాత్రమే ఆదాయం వచ్చింది. ఈ విధంగా నిషేధిత జాబితాలో భూములు ఉంటే ప్రభుత్వం ఇచ్చిన లక్ష్యాన్ని ఏవిధంగా చేరుకోవాలో అర్థం కావడం లేదు.
>
> – షేక్.షాన్, సబ్‌రిజిస్ట్రార్

తొలి దశలో గుర్తిస్తే క్యాన్సర్‌ను జయించొచ్చు

- క్యాన్సర్ స్క్రీనింగ్ పై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలి
- ప్రముఖ సినీ నటి గౌతమి

మద్దిపాడు: క్యాన్సర్‌ను తొలిదశలో గుర్తిస్తే ప్రతి ఒక్కరూ జయించవచ్చని ప్రముఖ సినీ నటి, లైఫ్ ఎగెయిన్ ఫౌండేషన్ సంస్థ నిర్వాహకురాలు గౌతమి అన్నారు. క్యాన్సర్‌పై అవగాహన కోసం మద్దిపాడు మండలం ఏడుగుండ్లపాడులో మంగళవారం నిర్వహించిన స్క్రీనింగ్ పరీక్షలు, బహిరంగ సభలో ఆమె మాట్లాడారు. సకాలంలో పరీక్షలు, సత్వర వైద్యం, మనో ధైర్యంతో క్యాన్సర్ పై తాను విజయం సాధించాలని తెలిపారు. శరీరంలో ఏమాత్రం మార్పు కనిపించినా నిర్లక్ష్యం చేయొద్దని, పరీక్షలు చేయించుకోవడంలో సిగ్గు పడరాదని అన్నారు. వ్యాధులు ముందుగా గుర్తిస్తే ఆహారంలో మార్పుల తోపాటు వ్యాయామం చేయాలని సూచించారు. వ్యాయామం ద్వారా ఎన్నో రోగాలను అదుపు చేసుకోవచ్చని చెప్పారు. మహిళలకు క్యాన్సర్ పై అవగాహన పెంచాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. సరైన అవగాహన, సత్వర వైద్యంతో క్యాన్సర్‌ను జయించవచ్చని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్ అన్నారు. మూడు రకాల క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించాలని గత ఏడాది నవంబర్ 14న ప్రక్రియ ప్రారంభించామన్నారు. క్యాన్సర్లలో 63 శాతం నివారించుకోవచ్చు అని, మిగతా 37 శాతం జన్యుపరమైన కారణాల వలన నివారణ కష్టం అన్నారు. ఏడుగుండ్లపాడు గ్రామంలో 329 మందికి స్క్రీనింగ్ చేయగా 11 క్యాన్సర్ అనుమానత కేసులను గుర్తించామని, వీటిలో పది నోటికి సంబంధించినవి కాగా, ఒకటి రొమ్ముకు సంబంధించిన కేసు అని ఆయన తెలిపారు. తన తల్లి, అక్కా క్యాన్సర్ కారణంగా మరణించారని చెప్పారు. కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా మాట్లాడుతూ జిల్లాలో 4,07,85,186 మంది 18 ఏళ్లు నిండిన ప్రజలు ఉన్నారని, వీరిలో 94,99,268 మందికి ఇప్పటి వరకు స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించామని తెలిపారు. వీరిలో 37 వేలకు పైగా నోటి, 24 వేలకు పైగా రొమ్ము, 26 వేలకు పైగా గర్భాశయ ముఖ ద్వార అనుమానిత కేసులను గుర్తించామన్నారు. క్యాన్సర్ నివారణకు స్క్రీనింగ్ చేయించుకుంటామని స్థానికులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు దామచర్ల జనార్దన్ రావు, బీఎన్. విజయ్ కుమార్, ప్రజారోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ డైరెక్టర్ డాక్టర్ పద్మావతి, అసంక్రమిత వ్యాధుల నివారణ కార్యక్రమ రాష్ట్ర నోడల్ ఆఫీసర్ కె.శ్యామల, మాజీ ఎమ్మెల్యే దారా సాంబయ్య, జిల్లా రెవెన్యూ అధికారి బి.చిన ఓబులేసు, డీఎంహెచ్‌వో టి.వెంకటేశ్వర్లు, డీసీహెచ్ఎస్ సూరిబాబు, ఆర్.బీ.ఎస్.కె.డి.పి.ఎం. డాక్టర్ భగీరథి, ఆర్డీఓ లక్ష్మీ ప్రసన్న, తహశీల్దార్ సుజన్ కుమార్, సర్పంచ్ శిల్ప సౌందర్య పాల్గొన్నారు.



క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షల కేంద్రాన్ని పరిశీలిస్తున్న సినీనటి గౌతమి, మంత్రి సత్యకుమార్ యాదవ్

హైవే దొంగతనాలపై ఎస్పీ సీరియస్

- హైవే సిబ్బందిని తొలగించి కొత్త వారికి బాధ్యతల అప్పగింత
- హైవే పోలీసు స్టేషన్ సమీపంలోని పోలీసులకు హెచ్చరికలు
- చోరీలపై విచారించి నివేదిక ఇవ్వాలని సీసీఎస్ సిబ్బందికి ఆదేశాలు

సాక్షి ఎఫెక్ట్..

ఒంగోలు టౌన్: హైవేల వెంట నిలిపి ఉంచిన లారీల నుంచి డీజిల్ దొంగిలిస్తున్న ముఠాల గురించి 'హైవేలపై కేడీలు' అనే శీర్షికతో సోమవారం 'సాక్షి' దినపత్రికలో ప్రచురితమైన కథనానికి ఎస్పీ ఏఆర్ దామోదర్ స్పందించారు. హైవేలపై దీర్ఘకాలంగా పనిచేస్తున్న హైవే పోలీసులను ఆ విధుల నుంచి తొలగించి వారి స్థానంలో కొత్త వారికి బాధ్యతలు అప్పగించారు. మంగళవారం ఉదయం జరిగిన సెట్ కాన్ఫరెన్స్‌లో మాట్లాడిన ఆయన జిల్లాలో హైవేల వెంట ఉన్న పోలీసు స్టేషన్లలో విధులు నిర్వహిస్తున్న పోలీసు అధికారులపై సీరియస్ అయినట్లు సమాచారం. హైవేలపై ఇన్ని చోరీలు జరుగుతుంటే మీరేమి చేస్తున్నారని మండిపడినట్లు తెలిసింది. ఎలాంటి అవకతవకలకు పాల్పడినట్లు తెలిసినా శాఖాపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించినట్లు సమాచారం. ఇప్పటికే ఎస్పీ కొంత సమాచారాన్ని తెప్పించుకున్నట్లు తెలుస్తోంది. దొంగ డీజిల్ విక్రయాలకు పాల్పడుతున్న వారి నుంచి మామూళ్లు వసూలు చేస్తున్నట్లు ఒక ఎస్‌ఐ పేరు ప్రముఖంగా వినిపిస్తుండడంతో అతడిపై చర్యకు సమాయత్తం అవుతున్నట్లు విశ్వసనీయ సమాచారం.

ఛేంజ్ ద డెన్...

ఇదిలా ఉండగా సాక్షిలో కథనం ప్రచురితమైన వెంటనే సోమవారం ఉదయం ఒంగోలు సమీపంలోని ఒక కళ్యాణ మండపం పక్కన ఉన్న డెన్‌ను పోలీసులు దగ్గర ఉండి మరీ తొలగించినట్లు సమాచారం. హుటాహుటిన అక్కడకు చేరుకున్న పోలీసులు పాకను తొలగించివేశారు. అయితే హైవే దొంగల వద్ద నుంచి తక్కువ ధరకు డీజిల్ కొనుగోలు చేసి విక్రయించే వ్యాపారి తన డెన్‌ను ఉలవపాడుకు మార్చినట్లు తెలుస్తోంది. అతడొక్కడే కాకుండా జిల్లాలో దొంగ డిజిల్ విక్రయిస్తున్న దాబా నిర్వాహకులు కూడా సరుకును ఎక్కడికక్కడ సర్దేసినట్లు సమాచారం. నగరంలోని ఒక ప్రభుత్వ ఉన్నత పాఠశాల సమీపంలో దొంగలు తీసుకొచ్చిన జాకీలు, బ్యాటరీలను కొనుగోలు చేసే వ్యాపారులు పరారీలో ఉన్నట్లు తెలుస్తోంది. మరికొందరు తమ డెన్‌లను సేఫ్ జోన్‌కు మార్చినట్లు చెబుతున్నారు. మొత్తం మీద ఈ విషయాన్ని ఎస్పీ సీరియస్‌గా తీసుకోవడంతో పోలీసులు, దొంగ డిజిల్ విక్రేతల గుండెల్లో రైల్లు పరుగెడుతున్నాయి. ఇన్నాళ్లు దాబాల్లో ఉచితంగా బిర్యానీలు తింటూ, మూడు డీజిల్ క్యానులు, ఆరు బ్యాటరీల చందంగా రెండు చేతులా సంపాదించిన కొందరు పోలీసులు ఎవరి మీద దెబ్బ పడుతుందోనని ఆందోళన చెందుతున్నట్లు గుసగుసలు వినిపిస్తున్నాయి.



సోమవారం ఉదయం పోలీసులు తొలగించిన దొంగ డీజిల్ డెన్

నేడు, రేపు తపాలా జీవిత బీమా మెగా మేళా

ఒంగోలు వన్‌టౌన్: తపాలా జీవిత బీమా మెగా మేళాను బుధ, గురువారాలు నిర్వహిస్తున్నట్లు సీనియర్ సూపరింటెండెంట్ ఆఫ్ పోస్ట్ ఆఫీసెస్ ప్రకాశం డివిజన్ ఒంగోలు ఎండీ జాఫర్ సాధిక్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. వెయ్యి మందికి నూతనంగా తపాలా జీవిత బీమా కవరేజ్ అందించాలని లక్ష్యాలను నిర్దేశించినట్లు చెప్పారు. 1 కోటి రూపాయల ప్రీమియం సమీకరించేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. పోస్టాఫీసులో జీవిత బీమా వలన తక్కువ ప్రీమియం, ఎక్కువ బోనస్‌లతో కూడిన పాలసీలను పొందవచ్చన్నారు. గ్రామీణ తపాల బీమాను గ్రామీణ ప్రాంత ప్రజలందరూ ఉపయోగించుకోవాలని సూచించారు. గతంలో కేవలం ప్రభుత్వ ఉద్యోగులకే పరిమితమైన పోస్టాఫీసు బీమా, ప్రస్తుతం పట్టభద్రులందరికీ డిప్లొమా, డిగ్రీ, ఐటీఐ వారికి కుడా అందుబాటులోకి వచ్చిందన్నారు.

మిర్చి రైతులను ప్రభుత్వమే ఆదుకోవాలి

- ధరల పతనంతో నష్టాల్లో మిర్చి రైతులు
- మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు చేయాలి

నాగులుప్పలపాడు: ఈ ఏడాది మిర్చి రైతులు తీవ్రంగా నష్టాల్లో కూరుకుపోయారని, ఆ రైతులను ప్రభుత్వమే ఆదుకోవాలని మాజీ మంత్రి మేరుగు నాగార్జున డిమాండ్ చేశారు. మండలంలోని ఒమ్మెవరం గ్రామంలో మిర్చి కల్లాల్లో పంటను మంగళవారం పరిశీలించి రైతులతో మాట్లాడారు. ఈ సందర్భంగా మేరుగు నాగార్జున మాట్లాడుతూ మిర్చి పంటకు సరైన ధర లేక రైతులు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారని, గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో రైతులు ఏనాడూ గిట్టుబాటు ధర కోసం ఎదురు చూడకుండా ప్రభుత్వమే అండగా నిలిచిందన్నారు. పొగాకు రైతులను ఆదుకున్న ఘనత మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందన్నారు. గత ఏడాది మిర్చి ధరలు క్వింటాలుకు రూ.20 వేల నుంచి రూ.30 వేల వరకు పలికాయని, ప్రస్తుతం ఈ ధరలు క్వింటాకు రూ.12 వేలకు పడిపోవడం బాధాకరమన్నారు. రైతులకు ఎకరాకు రూ.2.50 లక్షల వరకు పెట్టుబడి అవుతుందని, ఈ పరిస్థితుల్లో నల్లి, తామర తెగులుతో దిగుబడులు భారీగా తగ్గాయని అన్నారు. ఎకరాకు దిగుబడి 10 నుంచి 15 క్వింటాళ్లకు మించకపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని తెలిపారు. తద్వారా ఒక్కో ఎకరానికి రైతు సుమారు రూ.1.50 లక్షల వరకు నష్టపోతున్నారన్నారు. కూటమి ప్రభుత్వం రైతులను పట్టించుకోకపోవడం సరైన పద్ధతి కాదని విమర్శించారు. అన్నదాత సుఖీభవ ఇస్తామని చెప్పి నేటికీ అందచేయక పోగా పూర్తి స్థాయి ఇన్సూరెన్స్ ఎత్తివేసి రైతులను మోసం చేసిందన్నారు. ఇప్పటికైనా నష్టాల్లో ఉన్న మిర్చి రైతులను దళారుల బారి నుంచి కాపాడి వారికి ధర గిట్టుబాటు అయ్యేలా మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు చేసి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు నలమలపు కృష్ణారెడ్డి, మండల కన్వీనర్ పోలవరపు శ్రీమన్నారాయణ, గ్రీవెన్స్ సెల్ జిల్లా అధ్యక్షుడు పోలినేని కోటేశ్వరరావు, కంచర్ల సుధాకర్, కోటిరెడ్డి, కుమ్మూరి సుధాకర్, గండు వెంకట్రావు, హరిబాబు, మాదాసు రాంబాబు, అంజిరెడ్డి, బాలకృష్ణ, సుబ్బారావు, వెంకటేష్, ప్రవీణ్ ఉన్నారు.



మిర్చి రైతులతో మాట్లాడుతున్న మేరుగు నాగార్జున

వైపాలెం తహసీల్దార్ బాల కిషోర్ సస్పెన్షన్

- వీఆర్వో, సర్వేయర్‌లు కూడా..
- రూ.5 కోట్ల విలువైన స్థలాల అక్రమ రిజిస్ట్రేషన్‌కు సహకరించినందుకే వేటు

యర్రగొండపాలెం: స్థానిక తహసీల్దార్ బాల కిషోర్, వీఆర్వో ఎల్లయ్య, సర్వేయర్ దిలీప్‌లను సస్పెండ్ చేస్తూ కలెక్టర్ తమీమ్ అన్సారియా మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. మార్కాపురం రోడ్డులో ఉన్న ఎస్సీ బాలికల హాస్టల్ ఎదురుగా సర్వే నంబర్ 58, 58/1లతో పాటు రోడ్లు, భవనాల శాఖకు చెందిన స్థలాలను అక్రమంగా రిజిస్ట్రేషన్ అయ్యేందుకు సహకరించిన వారిపై ఈ వేటు పడింది. దాదాపు రూ.5 కోట్ల విలువ చేసే ఈ స్థలాలను మండలంలోని సర్వాయపాలేనికి చెందిన ఒకరు అక్రమంగా రిజిస్ట్రేషన్ చేయించుకునేందుకు అధికారులు పెద్ద మొత్తంలో డబ్బులు తీసుకొని అతనికి కావలసిన డాక్యుమెంట్లు అందజేశారు. ఈ విషయం తెలుసుకున్న వాస్తవ స్థల హక్కుదారులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఆమేరకు కలెక్టర్ ఆదేశాలతో మార్కాపురం సబ్ కలెక్టర్ వెంకట్ త్రివినాగ్ ఈ నెల 3వ తేదీ ఆ స్థలాలపై దర్యాప్తు చేసి నివేదికను అందజేశారు. ఆ నివేదిక ప్రకారం ఈ నెల 15వ తేదీ వీఆర్వో 2 ఎల్లయ్యను పాలుట్ల పంచాయతీకి, సర్వేయర్ దిలీప్‌ను కాశికుంట తండాకు బదిలీ చేశారు. తహసీల్దార్ బాల కిషోర్ దీర్ఘకాలిక సెలవుపై వెళ్లడం వలన ఆయన్ను బదిలీ చేయలేదు. ఆయన స్థానంలో డిప్యూటీ తహసీల్దార్ నలగాటి మల్లికార్జున నాయుడికి పూర్తి బాధ్యతలు అప్పచెప్పి ఇన్‌చార్జి తహసీల్దార్‌గా నియమించారు. ఆ తరువాత వారిని సస్పెండ్ చేసినట్లు కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. కాగా మరో రెండు శాఖలకు చెందిన అధికారులు కూడా పెద్ద మొత్తాల్లో దండుకొని అక్రమ రిజిస్ట్రేషన్‌కు సహకరించినట్లు తెలిసింది. ఆ స్థలాల్లో సర్వేనంబర్ 58లో ఉన్న రేకుల షెడ్డుకు సర్వాయపాలేనికి చెందిన దొడ్డపనేని శ్రీనివాసరావు పన్ను చెల్లిస్తున్నట్లు పంచాయతీ కార్యదర్శి ఈదుల రాజశేఖరరెడ్డి రశీదు ఇచ్చాడు. తహసీల్దార్, పంచాయతీ కార్యదర్శి తగిన ధ్రువీకరణ పత్రాలు ఇవ్వడం వలన తాము రిజిస్ట్రేషన్ చేసినట్లు ఆ శాఖ అధికారులు సబ్ కలెక్టర్ విచారణలో చెప్పారు. రెవెన్యూ, పంచాయతీ, రిజిస్ట్రేషన్ అధికారుల అండదండలు ఉండటం వలన శ్రీనివాసరావు గతనెల 16వ తేదీ, 22వ తేదీన తన భార్యతో రిజిస్ట్రేషన్ చేయించాడు. తగిన ఆధారాలు లేకుండా రిజిస్ట్రేషన్ చేసిన వారిపై ఉన్నతాధికారులు ఎటువంటి చర్యలు తీసుకుంటారో వేచి చూడాలి.



బాల కిషోర్

క్లుప్తంగా

అర్జీలపై ప్రత్యేక దృష్టి సారించండి

● కలెక్టర్ తమీమ్ అన్సారియా


కొణిజేడులో రీసర్వే రైతులతో మాట్లాడుతున్న కలెక్టర్ అన్సారియా

టంగుటూరు: రెవెన్యూ సదస్సుల్లో ప్రజల నుంచి వచ్చిన అర్జీలను చేయతగినవి, చేయలేనివి విభజించాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా అన్నారు. స్థానిక రెవెన్యూ కార్యాలయాన్ని మంగళవారం కలెక్టర్ ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కార్యాలయంలోని రికార్డులు, రిజిష్టర్లు పరిశీలించారు. రైతులకు పొలాల ఆన్‌లైన్ ప్రక్రియ సక్రమంగా నిర్వహించారో లేదో రైతులకు ఫోన్ చేసి అడిగి తెలుసుకున్నారు. అనంతరం కొణిజేడులో జరుగుతున్న రీ సర్వే పనులను పరిశీలించారు. రీ సర్వే త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. అనంతరం రైతులతో సమావేశం నిర్వహించి రీ సర్వే సమయంలో సంబంధిత రైతులకు నోటీసులు ఇచ్చారో లేదో అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఆంజనేయులు, డిప్యూటీ తహసీల్దార్ శ్రీనాథ్, డిప్యూటీ ఇన్‌స్పెక్షన్ అధికారి భాస్కర్, సిబ్బంది పాల్గొన్నారు.

చేతులెత్తేసిన చిట్టీల వ్యాపారి

● లబోదిబోమంటున్న బాధితులు


పోలీస్ స్టేషన్ వద్ద బాధితులు

పొదిలి: పట్టణంలోని ఓ చిట్టీల వ్యాపారి చేతులెత్తేశారు. దీంతో బాధితులు లబోదిబోమంటూ స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. వివరాల్లోకి వెళితే..పట్టణంలో వస్త్ర దుకాణం నిర్వహించే మహిళ కొన్ని ఏళ్లుగా చిట్టీల వ్యాపారం చేస్తోంది. సదరు మహిళ భర్త ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కావడంతో ఆమె వద్ద ఎంతో మంది చిట్టీలు వేశారు. కొన్నేళ్లుగా చిట్టీల నిర్వహణ సక్రమంగా సాగింది. అయితే గత రెండు మూడు సంవత్సరాలు చిట్టీల కాలం పూర్తయినా పాడుకున్న వారికి నగదు సకాలంలో ఇవ్వడం లేదు. దీంతో చిట్టీలు వేసిన వారు ఆమె వద్ద ప్రాంసరీ నోట్లు రాయించుకున్నారు. వారితో పాటు మరికొంత మంది సదరు మహిళ వడ్డీ పేరుతో నగదు తీసుకుంది. నగదు చెల్లింపులు సక్రమంగా జరగకపోవడంతో చిట్టీల పాడుతున్న వారు ఆమెను నిలదీస్తున్నారు. ఈ క్రమంలో సోమవారం సాయంత్రం ఆమె నిర్వహిస్తున్న వస్త్ర దుకాణం వద్ద జరిగిన గొడవ బాధితులందరిలో మరింత అనుమానం రేకెత్తించింది. డబ్బులు వచ్చే అవకాశం లేకపోవడంతో బాధితులంతా పోలీసులను ఆశ్రయించారు. బాధితులంతా మధ్య తరగతి చెందిన వారే. చిరు వ్యాపారులు, చిరుద్యోగులు రూపాయి రూపాయి కూడబెట్టి భవిష్యత్‌లో పిల్లల వివాహ, విద్యా అవసరాలకు పనికి వస్తాయని చిట్టీలు వేశారు. సదరు చీటీల నిర్వాహకురాలు భర్త ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కావడంతో ఎప్పుడైనా తమ డబ్బులు వస్తాయని ఆశతో ఎదురు చూశారు. కానీ సకాలంలో నగదు ఇవ్వకపోవడంతో చిట్టీలు వేసిన వారు దిక్కుతోచని స్థితిలో పోలీసులను ఆశ్రయించారు. చిట్టీల కాలం పూర్తయినా నగదు ఇవ్వకుండా ఇబ్బందులకు గురిచేస్తోందని, మా డబ్బులు మాకు ఇప్పించేలా చూడాలని ఫిర్యాదు చేశారు.

ఎక్సైజ్ ఖాజా.. కూటమికి బాజా!

● గత ప్రభుత్వంలో సారా విక్రయాలు ఎక్కువయ్యాయంటున్న ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఖాజా మొహిద్దీన్
● బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి ఇదే తీరు
● కానిస్టేబుల్ బదిలీల్లో అవినీతి ఆరోపణలు వచ్చినా చర్యలు తీసుకోని ప్రభుత్వంపై స్వామి భక్తి
● సొంత శాఖలో జరిగిన రూ.2.34 కోట్ల గోల్‌మాల్‌లో ఖాజా పాత్రపై ఆరోపణలు
● రమణ చౌదరిని రక్షించేందుకు చివరి నిమిషం వరకు ప్రయత్నాలు



సాక్షి ప్రతినిధి, ఒంగోలు:

జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ పక్కా రాజకీయ నాయకుడిలా ప్రసంగించడం తీవ్ర చర్చనీయాంశమైంది. కూటమి ప్రభుత్వాన్ని పొగుడుతూ స్వామి భక్తిని చాటుకోవడమే కాకుండా గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వాన్ని విమర్శించడం వివాదాస్పదంగా మారింది. 2014 నుంచి 2019 వరకు చంద్రబాబు ప్రభుత్వం నవోదయ పథకాన్ని అమలు చేసిందని, నాటుసారా నిర్మూలనకు కృషి చేసిందని, ఆ తర్వాత వచ్చిన వైఎస్సార్ సీపీ ప్రభుత్వం హయాంలో సారా వినియోగం బాగా పెరిగిందని, మళ్లీ ఇప్పుడు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత రాష్ట్రాన్ని నాటుసారా రహిత రాష్ట్రంగా మార్చేందుకు నవోదయ 2.0 అమలు చేస్తున్నారని ఎక్సైజ్ సూపరింటెండెంట్ షేక్ ఖాజా మొహిద్దీన్ చెప్పుకొచ్చారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత ఎక్సైజ్ సూపరింటెండెంట్‌గా బాధ్యతలు స్వీకరించిన ఆయన స్వామి భక్తిని ప్రదర్శించే విషయంలో తొలిరోజు నుంచే వెనకాడటం లేదు. మీడియా సమావేశాల్లో ముఖ్యమంత్రి చంద్రబాబును పొగడ్తలతో ముంచేయడం ఆయనకు రివాజుగా మారింది. యథాలాపంగానే మంగళవారం జిల్లా ఎక్సైజ్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో కూడా అదే తీరుగా వ్యవహరించడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. బుధవారం జిల్లా పోలీసు కార్యాలయంలోని పరేడ్ గ్రౌండ్‌లో నవోదయ 2.0 కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. ఈ వివరాలు వెల్లడించేందుకు ఖాజా మొహిద్దీన్ తన కార్యాలయంలో మీడియా సమావేశం నిర్వహించారు. తాను జిల్లా ఉన్నతాధికారినన్న విషయాన్ని మరచిపోయి ఒక రాజకీయ నాయకుడి తరహాలో గత ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. గత ప్రభుత్వ హయాంలో కూడా ఆయన ఇదే శాఖలో విధులు నిర్వహించిన సంగతి మరిచిపోయినట్టున్నారు.

రమణ వ్యవహారంలో పాత్ర?

ఒంగోలు ఎక్సైజ్ శాఖలో రమణ చౌదరి అనే కానిస్టేబుల్ 2.34 కోట్ల రుపాయల గోల్‌మాల్‌కు పాల్పడిన ఘటన రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం సృష్టించడం తెలిసిందే. నగరంలోని ఎలైట్ మాల్‌లో విక్రయించిన మద్యం తాలూకు డబ్బును ఏరోజుకారోజు ప్రభుత్వానికి చెల్లించాల్సి ఉంది. అయితే రమణ చౌదరి అనే కానిస్టేబుల్ ప్రభుత్వానికి లెక్కలు చూపకుండా రూ.2.34 కోట్లు కాజేశాడు. ఈ వ్యవహారం బయట పడకుండా ఉండేందుకు ఎలైట్ మాల్‌ను తగలబెట్టాలని ప్రయత్నించినట్లు కథనాలు వచ్చాయి. అవినీతి బట్టబయలైన తరువాత కానిస్టేబుల్ రమణ చౌదరి అధికారులకు అందుబాటులో లేకుండా పరారరయ్యాడు. అతని పరారీ వెనక కూడా ఖాజా మొహిద్దీన్ హస్తం ఉన్నట్లు ప్రచారం జరిగింది. ఎక్సైజ్ శాఖకు రూ.కోట్లలో కన్నం వేసిన కానిస్టేబుల్ మీద పోలీసులకు ఫిర్యాదు చేయకపోవడంపై విమర్శలు వెల్లువెత్తాయి. తిలాపాపం తలా పిడికెడు తరహాలో రమణ చౌదరి కాజేసిన డబ్బును రికవరీ పేరుతో తలా కొంత వేసుకుని చెల్లించడంతో చివరికి ఈ పరారీ కథ కంచికి చేరింది. రమణ చౌదరి కేసు వ్యవహారాన్ని మాఫీ చేసేందుకు కూటమి పెద్దల ఆశీస్సులతో ఈఎస్ ఖాజా మొహిద్దీన్ చివరి నిమిషం వరకు ప్రయత్నించినట్లు ఆరోపణలున్నాయి. ఉన్నతాధికారుల ప్రమేయం లేకుండా ఒక సాధారణ కానిస్టేబుల్ కోట్ల రుపాయల నిధులను ఎలా కాజేయగలడన్న ప్రశ్నకు ఇప్పటికీ జవాబు లేదు. కూటమి పెద్దల మెప్పు కోసం ఖాజా భాయ్ ఎంతకైనా తెగిస్తారని ఆ శాఖ ఉద్యోగులే చెప్పుకుంటున్నారు.

బెల్ట్ షాపుల సంగతేంటి సార్?

రాష్ట్రంలో నాటు సారా నిర్మూలించడం సంగతి పక్కనబెడితే జిల్లాలో జోరుగా సాగుతున్న బెల్ట్ షాపులపై ఈఎస్ నోరు మెదపడడం లేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక సర్కారీ మద్యం దుకాణాలను ఎత్తివేసి ప్రైవేట్ వ్యక్తులకు కట్టబెట్టడం తెలిసిందే. వాటికి అనుసంధానంగా ప్రస్తుతం జిల్లాలో సుమారు 2000కు పైగా బెల్ట్ షాపులు నడుస్తున్నట్లు అంచనా. ప్రతి గ్రామంలో కూటమి నేతల ఆశీస్సులతో సాగుతున్న బెల్ట్ షాపులను ఎక్సైజ్ అధికారులు చూసీచూడనట్టు వదిలేయడం విమర్శలకు తావిస్తోంది. భారీగా ముడుపులు పుచ్చుకొని చోద్యం చూస్తున్నట్లు ఈఎస్‌పై ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఒకవైపు ముఖ్యమంత్రి చంద్రబాబు బెల్ట్ షాపులు నిర్వహిస్తే ఊరుకునేది లేదని హెచ్చరిస్తున్నప్పటికీ జిల్లాలో మాత్రం అధికార పార్టీ ఎమ్మెల్యేల కనుసన్నల్లో బెల్ట్ షాపులు నడుస్తున్నాయన్నది జగమెరిగిన సత్యం. టీడీపీ కార్యాలయానికి కూతవేటు దూరంలో బెల్ట్ షాపు పెట్టి బహిరంగంగా మద్యం విక్రయిస్తున్నా పట్టించుకోని ఈఎస్ కూటమి నేతల భజనలో మునిగి తేలడం వివాదాస్పదంగా మారింది.

బదిలీల్లో ముడుపులు తీసుకున్నట్లు ఆరోపణలు

గత ఏడాది కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఎక్సైజ్ శాఖలో భారీగా బదిలీలు జరిగాయి. అపుడు రమణ చౌదరి అనే కానిస్టేబుల్‌తో చేతులు కలిపిన ఈఎస్ ఖాజా మొహిద్దీన్ అవినీతికి పాల్పడినట్లు ఆరోపణలు వచ్చాయి. చేతులు తడిపిన వారికి మాత్రమే కోరుకున్న చోట పోస్టింగు ఇచ్చినట్లు ఆ శాఖలోని ఉద్యోగులే వాపోయారు. దీంతోపాటుగా అధికార పార్టీ ఎమ్మెల్యేలకు అనుకూలంగా వ్యవహరిస్తున్నట్లు జోరుగా చర్చ సాగుతోంది. అయినా ఈయనపై వచ్చిన ఆరోపణలను కూటమి పాలకులు పట్టించుకోకపోవడం ఆరోపణకు బలం చేకూరుస్తోంది.

అర్జీల పరిష్కారంలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

● జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణ


తహశీల్దార్లతో మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణ

ఒంగోలు సిటీ: రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన అర్జీల పరిష్కారంలో నిర్లక్ష్యం వహిస్తే సహించమని జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణ అన్నారు. స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో ఒంగోలు, కొత్తపట్నం, చీమకుర్తి, సంతనూతలపాడు, నాగులుప్పలపాడు మండలాల తహసీల్దార్లతో మంగళవారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన అర్జీలు, వాటి కేటగిరిలు, వాటి పరిష్కారానికి చేపట్టిన చర్యలు, పురోగతిపై సమీక్షించారు. రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన అర్జీల పరిష్కారంలో నిర్లక్ష్యం లేకుండా సహేతుక పరిష్కారం చూపాలని స్పష్టం చేశారు. సమావేశంలో ఆర్డీవో కె.లక్ష్మీ ప్రసన్న తదితరులు పాల్గొన్నారు.

దాడికి పాల్పడిన నిందితులకు రిమాండ్

పీసీపల్లి: మండల పరిధిలోని మురుగమ్మిలో ఈనెల 13న పొలం వివాదంలో లెక్కల వెంగళరెడ్డి, శబరి కంటారెడ్డిలపై దాడికి పాల్పడిన వల్లెం రాజశేఖర్ రెడ్డి, భార్య వల్లెం రాజ్యలక్ష్మిలను అరెస్టు చేశారు. వారిని జడ్జి ముందు హాజరు పరచగా 14 రోజుల రిమాండ్ విధించగా..ఒంగోలు జైలుకు తరలించినట్లు ఎస్సై కోటయ్య తెలిపారు. కేసు విచారణ సాగుతోందని, మిగిలిన నిందితులను కూడా అరెస్టు చేస్తామని పేర్కొన్నారు.

కాళ్ల పారాణి ఆరకముందే.. మిస్టరీగా మృతదేహాలు


సుశ్మిత మృతదేహం


వధూవరుల ఫొటోతో కారుపై అంటించిన వివాహ ఆహ్వానం


ఆస్పత్రి వద్ద మృతురాలి భర్త వెంకటేశ్వర్లు, అతని సోదరి

● పెళ్లయిన మరుసటి రోజే ఉరేసుకొని నవవధువు ఆత్మహత్య

కంభం: కాళ్లకు రాసుకున్న పసుపు, పారాణి ఆరకముందే ఓ నవవధువు పుట్టింట్లోనే ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. ఈ సంఘటన మండలంలోని దేవనగరంలో మంగళవారం మధ్యాహ్నం జరిగింది. వివరాల్లోకి వెళితే..మండలంలోని చిన్నకంభం పంచాయతీ దేవనగరంలో నివాసం ఉంటున్న బిల్లా లాజర్‌కు ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు. చిన్న కుమార్తె బిల్లా సుశ్మిత(20) అగ్రికల్చర్ పాలిటెక్నిక్ పూర్తి చేసింది. ఈ నెల 16వ తేదీన దూరపు బంధువు అయిన పెద్దారవీడు మండలం సిద్ధినాయుడుపల్లి గ్రామానికి చెందిన వెంకటేశ్వర్లుతో వివాహం చేశారు. మరుసటి రోజు సోమవారం దేవనగరం గ్రామంలో సుశ్మిత ఇంటి వద్ద మరుపెళ్లి కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. అనంతరం సారెపెట్టి అత్తగారింటికి అమ్మాయిని పంపించేందుకు తల్లిదండ్రులు ఆ పనుల్లో నిమగ్నమై ఉన్నారు. మంగళవారం ఉదయం 11 గంటల సమయంలో సుశ్మిత పక్కనే ఉన్న వారి బంధువుల ఇంటికి వెళ్తున్నానని చెప్పి వెళ్లగా అల్లుడు వెంకటేశ్వర్లు అత్తగారి ఇంట్లోనే కూర్చొని ఉన్నాడు. మధ్యాహ్నం ఒంటి గంట దాటినా ఇంటికి రాకపోవడంతో సుశ్మిత సోదరుడు భోజనం సమయం అయిందని చెల్లెల్ని పిలుచుకొని రావడానికి వారి బాబాయి ఇంటికి వెళ్లి చూడగా..అక్కడ గదిలో సుశ్మిత ఉరేసుకొని వేలాడుతూ కనిపించింది. వెంటనే కిందకు దించి కంభం ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధృవీకరించారు. పెళ్లయిన మరుసటి రోజే కూతురు ఆత్మహత్య చేసుకోవడంతో తల్లిదండ్రులు బోరున విలపించారు. కుమార్తెను అడిగే వివాహం చేశామని కుటుంబ సభ్యులు చెబుతున్నారు. ఇష్టం లేని వివాహం వల్లే ఆత్మహత్యకు పాల్పడిందా..? మరే ఇతర కారణాలు ఏమైనా ఉన్నాయా అన్న విషయాలు పోలీసుల విచారణలో తేలాల్సి ఉంది.


త్రోవగుంట రోడ్డులో మరణించిన గుర్తు తెలియని యువకుడి మృతదేహం


వెంగముక్కలపాలెం జంక్షన్ సమీపంలో గుర్తు తెలియని యువకుడి మృతదేహం

● రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు గుర్తు తెలియని యువకుల మృతి
● అనుమానాలకు తావిస్తున్న మరణాలు
● ఒకే తరహాలో ముఖంపై గాయాలు
● మరణాల వెనక మిస్టరీ ఏంటని చర్చించుకుంటున్న ప్రజలు

ఒంగోలు టౌన్: ఒకే రోజు ఇద్దరు యువకులు రోడ్డు ప్రమాదంలో మరణించారు. ఆ ఇద్దరు కూడా అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో మరణించడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇవి సహజంగా జరిగిన రోడ్డు ప్రమాదాలేనా లేక ఎవరైనా కావాలని చేసిన హత్యలా అనేది మిస్టరీగా మారింది. ఇంతకూ ఏం జరిగిందంటే...సోమవారం అర్ధరాత్రి త్రోవగుంట గ్రామ పరిధిలోని గుంటూరు నెల్లూరు రోడ్డులో ఒక షోరూం ఎదురుగా రోడ్డు పక్కన 25 ఏళ్ల వయసు కలిగిన యువకుడి మృతదేహం పడి ఉన్నట్లు సమాచారం వచ్చిందని తాలుకా పోలీసులు చెబుతున్నారు. ఈ యువకుడి ఒంటిపై షర్టు లేదు. బ్లూ రంగు జీన్ ఫ్యాంట్ ధరించి ఉన్నాడు. ముక్కుపై గాయాలు కావడంతో రక్తస్రావం అయినట్లు కనిపిస్తుంది. అదే రోజు మరో యువకుడు కూడా ఇదే తరహాలో మరణించాడు. అదివారం అర్ధరాత్రి నగరంలోని వెంగముక్కలపాలెం జంక్షన్ దగ్గరలో ఒక యువకుడి మృతదేహం పోలీసులకు లభ్యమైంది. రోడ్డుపై నడుచుకుంటూ వెళుతుండగా ఒంగోలు వైపు నుంచి వెళుతున్న కారు ఢీ కొనడంతో తల, నడుముకు తీవ్రమైన గాయాలు కావడంతో ఆ యువకుడు మృతి చెంది ఉంటాడని భావిస్తున్నట్లు పోలీసులు చెబుతున్నారు. అయితే ఇతడి ముక్కుపై కూడా గాయం అయి ఉండడం గమనార్హం. ముక్కు నుంచి రక్తం స్రవించిన గుర్తులు ఉన్నాయి. ఇప్పుడు ఈ రెండు మరణాల గురించి నగరంలో చర్చ సాగుతోంది. 17వ తేది అర్ధరాత్రి కాస్త అటు ఇటుగా ఒకే సమయంలో ఒకే వయసు కలిగిన ఇద్దరు యువకులు ఒకే తరహాలో మృతి చెందడం అనుమానాలను రేకిత్తిస్తుంది.

నిజంగానే ఈ యువకులు రోడ్డు ప్రమాదంలో మరణించారా లేక ఎక్కడైనా హత్య చేసి రోడ్డు ప్రమాదంగా చిత్రీకరించే ప్రయత్నాలు ఏమైనా జరుగుతున్నాయా అనేది సందిగ్ధంగా మారింది. ప్రస్తుతానికి తాలుకా పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. దర్యాప్తులో కానీ నిజనిజాలు బయటపడవు.

ప్రకాశంలో బర్డ్ ఫ్లూ లేదు

● పశు సంవర్ధకశాఖ జేడీ బేబీరాణి


మాట్లాడుతున్న జేడీ బేబీరాణి

సంతనూతలపాడు: జిల్లాలో బర్డ్‌ఫ్లూ లేదని, ప్రజలు కోడి మాంసం, కోడిగుడ్లు తిన వచ్చని జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి డాక్టర్ కె.బేబీరాణి స్పష్టం చేశారు. మంగళవారం సంతనూతలపాడు పశువైద్యశాలలో చీమకుర్తి, సంతనూతలపాడు మండలాల సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జేడీ మాట్లాడుతూ.. ఇతర జిల్లాల నుంచి పశువుల దాణా, కోడిగుడ్లు, కోళ్లను జిల్లాకు రవాణా చేయకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకున్నట్లు పేర్కొన్నారు. జిల్లాలో పశుగణన సర్వే దాదాపుగా పూర్తయినట్టు చెప్పారు. ఇప్పటికే కోళ్ల ఫామ్ యజమానులకు బర్డ్ ఫ్లూపై అవగాహన కల్పించి, కోళ్లకు వ్యాక్సిన్ కూడా వేశామన్నారు. వ్యర్థాల తొలగింపునకు కూడా ప్రత్యేక సూచనలిచ్చామన్నారు. సమావేశంలో ఏడీ డాక్టర్ కె.సుధీర్ బాబు, పశు వైద్యాధికారులు టి.మనురూప్, వై.పేరయ్య, పి.చిరంజీవి, బి ప్రతాపరెడ్డి, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

కంభంలో ఇరువర్గాల ఘర్షణ



తలకు గాయాలైన లింగమూర్తి

కంభం: ఇరువర్గాల మధ్య ఘర్షణలో నలుగురికి గాయాలైన సంఘటన మంగళవారం రాత్రి కంభంలోని తెలుగు వీధిలో చోటుచేసుకుంది. వివరాలు.. తెలుగు వీధిలో నివాసం ఉంటున్న వారు మంగళవారం ఉదయం దేవరకు పెట్టుకున్నారు. అక్కడి పరిణామాలపై మాటామాటా పెరగడంతో ఘర్షణ చోటుచేసుకుంది. సత్యలింగమూర్తి అనే వ్యక్తికి తలకు గాయాలు కాగా అరుణ్‌కుమార్, ప్రసాద్, మరొకరికి స్వల్పగాయాలయ్యాయి. ఘర్షణ అనంతరం ఓ వర్గం వారు అక్కడ ఉన్న కొస్టానికి నిప్పంటించగా చుట్టుపక్కల వారు నీళ్లు పోసి ఆర్పేశారు. తలకు గాయమైన లింగమూర్తిని మార్కాపురం వైద్యశాలకు తరలించారు. వీధిలో ఓ ఏఎస్సై, ఇద్దరు సిబ్బంది పహారా కాస్తున్నారు. ఘర్షణకు దిగిన ఇరువర్గాల వారు టీడీపీ సానుభూతిపరులేనని తెలిసింది. ఈ విషయమై ఎస్సై నరసింహారావును వివరణ కోరగా గొడవకు సంబంధించి బాధితులు ఎవరూ ఫిర్యాదు చేయలేదని తెలిపారు.

కుటుంబ సభ్యులే అంతమొందించారు

● కంభంలో సంచలనం రేపిన యువకుడి హత్య కేసులో నిందితులు అరెస్టు
● ఆటో డ్రైవర్‌తోపాటు తల్లి, ఇద్దరు సోదరుల హస్తం
● కేసు వివరాలు వెల్లడించిన డీఎస్పీ నాగరాజు


కేసు వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ నాగరాజు, పక్కన సీఐ, ఎస్సై


మృతుడు శ్యాం ప్రసాద్ (ఫైల్)

కంభం: కంభంలో సంచలనం రేపిన కదం శ్యాం ప్రసాద్ హత్య కేసులో కుటుంబ సభ్యులే పాత్రధారులని మార్కాపురం డీఎస్పీ యు.నాగరాజు పేర్కొన్నారు. మంగళవారం సాయంత్రం స్థానిక పోలీస్ స్టేషన్‌లో మీడియా సమావేశం నిర్వహించి కేసు వివరాలు వెల్లడించారు. ఈ నెల 14వ తేదీన సాయంత్రం కంభం పట్టణం జయప్రకాశ్ వీధిలోని ఇరిగేషన్ పంట కాల్వ గట్టు వెంబడి చిల్లచెట్ల మధ్య పసుపు రంగులో ఉన్న మూడు గోనె సంచులను పోలీసులు గుర్తించారు. అది కదం శ్యాంప్రసాద్(35) మృతదేహంగా నిర్ధారించుకుని విచారణ ప్రారంభించారు. పరారీలో ఉన్న నిందితులను మంగళవారం ఉదయం అదుపులోకి తీసుకుని విచారించగా నేరం చేసినట్లు అంగీకరించారని డీఎస్పీ తెలిపారు.

కుటుంబ సభ్యులే హత్య చేశారు

కదం శ్యాంప్రసాద్ చెడు వ్యసనాలకు బానిసై పనికి వెళ్లకుండా, సంపాదన లేకుండా మద్యం సేవించి తిరుగుతుండేవాడు. బంధువుల ఇంటికి వెళ్లినప్పుడు అక్కడ ఉన్న మహిళలతో అసభ్యకరంగా ప్రవర్తిస్తూ గొడవపడేవాడు. గతంలో తన చిన్నమ్మలైన చిన్న వెంకుబాయి, పెద్ద వెంకుబాయిలతో అసభ్యకరంగా ప్రవర్తించగా పెద్దల సమక్షంలో పంచాయతీ చేసి మందలించారు. ఈనెల 8న తన తల్లితో అసభ్యకరంగా ప్రవర్తించగా అన్న సుబ్రమణ్యం, తమ్ముడు కాశీరావు తీవ్రంగా మందలించారు. 12వ తేదీ లారీ క్లీనర్‌గా కర్నూలు జిల్లా ఓర్వకల్లుకు వెళ్లిన శ్యాం ప్రసాద్.. డ్రైవర్ ఉస్మాన్‌బాషాతో అక్కడ గొడవపడ్డాడు. విషయం తెలుసుకున్న తల్లి, సోదరులు అక్కడికి వెళ్లి అతన్ని ఇంటికి తీసుకొచ్చారు. 13వ తేదీన తల్లి లక్ష్మీదేవి, అన్న సుబ్రమణ్యం, తమ్ముడు కాశీరావు కలిసి శ్యాం ప్రసాద్‌ను చంపేయాలని నిర్ణయించుకున్నారు. సుబ్రమణ్యం స్నేహితుడైన ఆటోడ్రైవర్ వల్లంశెట్టి మోహన్‌తో కలిసి అదే రోజు రాత్రి హత్య చేశారు.

గొడ్డలి, కత్తితో 8 ముక్కలుగా నరికారు

శ్యాంబాబును ఇంట్లో హత్య చేసిన అనంతరం మృతదేహాన్ని బయటకు తీసుకెళ్లేందుకు తోపుడు బండ్లు, ఇతర వాహనం కోసం ప్రయత్నించగా అవి దొరకలేదు. మృతదేహం వాసన వస్తే చుట్టుపక్కల వారికి తెలిసిపోతుందని భావించి నలుగురూ కలిసి గొడ్డలి, కత్తితో 8 ముక్కలుగా నరికారు. మూడు గోతాల్లో శరీర భాగాలను కుక్కి ఎవరూ లేని సమయంలో మోసుకెళ్లి ఇంటికి సమీపంలో ఉన్న పంటకాల్వ వెంట పడేసి పరారయ్యారు. కాగా మంగళవారం నలుగురు నిందితులనూ పోలీసులు రిమాండ్‌కు తరలించారు. మీడియా సమావేశంలో సీఐ కె.మల్లికార్జున, ఎస్సై నరసింహారావు పాల్గొన్నారు.